జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com


బుధవారం | 21-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 106 పేజీలు: 8 వెల : రూ.7

# 10 మంది ఎస్ఐలకు.. వీఆర్



*** 26 మంది ఎస్ఐలకు బదిలీ * మరికొందరు ఎక్కడికక్కడే * ఫలించిన అధికార పార్టీ నేతల మాట**
*** సెటిల్‌మెంట్లు, అక్రమాలు, అవినీతికి పాల్పడిన వారికి జిల్లా పోలీస్ బాస్ బుద్ధి చెప్పారని గుసగుసలు**
*** మరికొద్ది రోజుల్లో పోలీసులకు బదిలీలు * ఇప్పటికే జాబితా సిద్ధం**

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 20 (వార్త):** విశాఖ పోలీస్ రేంజ్ పరిధిలో 26 మంది ఎస్ఐలకు బదిలీ అయింది. మంగళవారం డీఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరిలో పది మంది వీఆర్‌లోకి పంపించారు. ఇంకొంతమందికి బదిలీ కాలేదు. అయితే కొందరు ఎస్ఐల ఆగడాలపై ప్రజాప్రతినిధులు, ప్రజలు జిల్లా పోలీస్‌బాస్‌కు ఫిర్యాదులు కూడా చేశారు. కొందరు ఎస్ఐలు టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఎచ్చెర్ల ఎస్ఐ ఎస్.చిరంజీవికి జేఆర్‌పురం, పాడేరు ఎస్ఐ గుండ లక్ష్మణరావుకు లావేరు, ఇచ్ఛాపురం ఎస్ఐ సత్యనారాయణకు పొందూరు, అల్లూరి జిల్లాలో డీఎస్‌బీలో పనిచేసిన సి.దుర్గాప్రసాదరావుకు నరసన్నపేట, డీఎస్‌బీలో పనిచేసిన గర్భాపు రంజాత్‌కు పోలాకి, నరసన్నపేట ఎస్ఐ బి.అశోక్‌కు జలుమూరుకు బదిలీ అయింది. మందస ఎస్ఐ అనీల్‌కుమార్‌కు సారవకోట, అరకు ఎస్ఐ ఆర్.సంతోష్‌కు శ్రీకాకుళం టూటౌన్-1, మన్యం జిల్లా ఎస్ఐ బి.లావణ్యకు పాతపట్నం, పాతపట్నం ఎస్ఐ ఎండి యాశీన్‌కు హిరమండలం, మహిళాస్టేషన్ ఎస్ఐ బి.రేవతికి కాశీబుగ్గ-1, డీఎస్‌బీ ఎస్ఐ ఎస్‌కె.ఖాధర్‌కు మందస, చిన్నమేరంగి ఎస్ఐ చిన్నంనాయుడుకు ఇచ్ఛాపురం టౌన్, ఆర్.ఎ.వలస ఎస్ఐ ఈ.శ్రీనివాస్‌కు ఇచ్ఛాపురం రూరల్, వీఆర్‌లో ఉన్న కె.లక్ష్మణరావుకు మహిళా స్టేషన్ బదిలీ అయ్యారు. జేఆర్‌పురం ఎస్ఐగా ఉన్న కె.గోవిందరావు, శ్రీకాకుళం టూటౌన్ ఎస్ఐ హరికృష్ణ టూటౌన్, హిరమండలం ఎస్ఐ జి.నారాయణస్వామి, కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు, జలుమూరు ఎస్ఐ కె.మధుసూదనరావు, పోలాకి ఎస్ఐ వి.సత్యనారాయణలకు శ్రీకాకుళం వీఆర్‌కు అటాచ్ చేశారు. అలాగే లావేరు ఎస్ఐ స్వామినాయుడు, బూర్జ ఎస్ఐ గొండెల ప్రసాద్, సారవకోట ఎస్ఐ జి.అప్పారావు, ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఎస్.లక్ష్మణరావుకు విశాఖ వీఆర్‌కు అటాచ్ చేస్తూ జిల్లా పోలీస్ బాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంకా ఆమదాలవలస, టెక్కలి, మెళియాపుట్టి, సోంపేట, కంచిలి, కవిటి ఎస్ఐలతో పాటు మరికొందరికి ప్రస్తుతానికి బదిలీ కాలేదు. అయితే గత ప్రభుత్వ హయాంలో కొందరు ఎస్ఐలు అప్పటి ఎమ్మెల్యేల అడుగులకు మడుగులొత్తిన వారిపై కొరడా ఝుళిపించినట్టు విమర్శలు వినిపించాయి. అలాగే కొందరు ఎస్ఐలు శాంతిభద్రతల పరిరక్షణ కన్నా సెటిల్‌మెంట్లు, భూదందాలు, అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, అటువంటి వారిలో కొందరిపై జిల్లా పోలీస్‌బాస్ సరైన నిర్ణయం తీసుకున్నారని పోలీస్ శాఖలోనే గుసగుసలు వినిపించాయి. మరో వారం పది రోజుల్లో ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీసు కానిస్టేబుళ్లకు కూడా బదిలీ కానుంది. ఇప్పటికే జాబితా సిద్ధమైందని సమాచారం. ఏయే పోలీస్‌స్టేషన్లలో అక్రమాలు, అవినీతికి పాల్పడిన కానిస్టేబుళ్ల జాబితా జిల్లా పోలీస్‌బాస్ దగ్గర ఉందని, త్వరలో వారిని కూడా బదిలీలు చేస్తారని తెలిసింది. చాలా వరకూ పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత వెంటాడుతోంది. జిల్లా పోలీస్ కార్యాలయంలో పాస్‌పోర్టు పేరిట చాలామంది పనిచేస్తున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పని లేక ఖాళీగా ఉన్న వారిని వివిధ పోలీస్‌స్టేషన్లకు పంపిస్తారని కొందరు బహిరంగంగా చెబుతున్నారు. దీంతో ఎవరెవరికి ఎక్కడికి బదిలీ చేస్తారో అని పోలీసులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.



# హాస్టల్స్‌కు.. బయటి ఆహారం అనుమతించొద్దు

*** విద్యార్థులకు బలవర్ధక ఆహారాన్ని ఇవ్వాలి * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * వసతి గృహ అధికారులతో సమీక్ష**

**శ్రీకాకుళం, ఆగస్టు 20 (వార్త):** జిల్లాలో నడుపుతున్న హాస్టల్స్‌కు బయటి నుంచి ఆహారం అనుమతించకూడదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ వసతీ గృహాలు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న బాలల రక్షిత గృహాలు, హాస్టల్స్ నడుపుతున్న యాజమాన్యాలతో ఆయన సమావేశం నిర్వహించారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూల్స్‌లలో చదువుకుంటున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించాలని ఆదేశించారు. విద్యా శాఖ విద్యార్థులకు అక్షయపాత్ర నుండి ఆహారం వస్తుందని డీఈవో కృష్ణ చైతన్య వివరించారు. స్టోరేజ్ చేసిన తాగునీరు వినియోగించకూడదని కలెక్టర్ చెప్పారు. ఆర్‌వో ప్లాంట్ ఉండేటట్టు చూడాలన్నారు. 500 మంది దాటిన వారికి ప్రత్యేక అధికారి ఉండాలని చెప్పారు. 500 లోపల ఉన్న హాస్టళ్లకు కింద స్థాయి అధికారి ప్రత్యేక అధికారి ఉండాలన్నారు. సెక్యూరిటీ ఉండాలని చెప్పారు. డోనర్స్ ద్వారా ఆహారం సరఫరా చేస్తున్నది లేనిది ఆయన ఆరా తీశారు. బయటి నుంచి ఆహారం తీసుకోకూడదని చెప్పారు. కాలేజీ అటాచ్డ్ డ్ హాస్టల్ ఉంటేనే నడపాలని వెనకబడిన సంక్షేమ అధికారి అనూరాధ కలెక్టర్ కు వివరించారు. మండలాలు జిల్లా కేంద్రాల్లో ఉన్న హాస్టళ్లను గుర్తించాలన్నారు. పిహెచ్‌సి డాక్టర్‌లకు ట్యాగ్ చేయాలని డిఎంహెచ్‌ఓను ఆదేశించారు. ఎక్స్పైరీ డేట్ చూసుకోవాలని చెప్పారు. ఆహారం కలుసితం కాకుండా చూడాలన్నారు. కిచెన్ వద్ద పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ క్లీనింగ్ చేయాలని, బయటి నుంచి ఆహారం తీసుకోకూడదని చెప్పారు. మషాలాలకు రంగు వేస్తున్న నేపథ్యంలో బయటి ఆహారం తీసుకోకూడదని తెలిపారు. బయటి ఫుడ్ పొల్యూషన్ అవుతుందని వివరించారు. ఎక్స్పైరీ డేట్ అయిపోతే పారవేయాలని ఆహార భద్రతా అధికారి జి. శ్రీరాములు చెప్పారు.సహాయ భద్రత నియంత్రణాధికారి



వెంకటరత్నం 9704009989 నంబర్ కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం హాస్టల్స్ నడుపుతున్న యాజమాన్యాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతి శ్రీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టళ్లలో మెనూ బయటి డిసిప్లే చేయాలన్నారు. బయటి నుండి ఫుడ్ తీసుకోకూడదని చెప్పారు. పాత హిస్టరీని పరిశీలించి సెక్యూరిని ఏర్పాటు చేయాలని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. సందర్శకుల రిజిష్టర్ ఉండాలని తెలిపారు. బిసి సంక్షేమ అధికారి అనూరాధ, సాంఘిక సంక్షేమ శాఖ డిడి, డిఎంహెచ్‌ఓ, రెసిడెన్షియల్ స్కూల్ కో ఆర్డినేటర్, తదితరులు పలు సూచనలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి కృష్ణ చైతన్య, జిల్లా రెసిడెన్షియల్ స్కూల్స్ కోఆర్డినేటర్ బాలాజీ నాయక్, ఆర్ఐఓ దుర్గారావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీ లక్ష్మి, ప్రొటెక్షన్ జిల్లా అధికారి రమణ పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## దుష్ప్రచారాలు చేస్తే సహించం : బగ్గు

పోలాకి, ఆగస్టు 20(వార్త): నర్సన్నపేటలో ఓ టిఫిన్ షాప్ వద్ద సోమవారం రాత్రి జరిగిన సంఘటనపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్పందించారు. తన అనుచరులు అంటూ చేసిన దాడులను ఉపేక్షించేది లేదని ఆయన మండిపడ్డారు. సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాలను తిప్పికొట్టారు. నిందితులు వదిలేది లేదని స్పష్టం చేశారు. కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించానన్నారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు.

## నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు బదిలీ

జలుమూరు, ఆగస్టు 20(వార్త): నరసన్నపేట మండల ఎస్ఐగా పనిచేస్తున్న బి.అశోక్‌బాబును జలుమూరు మండల ఎస్ఐగా బదిలీ చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో బూర్జ మండల ఎస్ఐగా ఉన్న ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. కొద్దికాలంగా విధులు నిర్వహిస్తున్న ఆయనను జలుమూరుకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. జలుమూరు ఎస్ఐ మధుసూదనరావుకు విశాఖపట్నం డీఐజీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

# ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



మందస, ఆగస్టు 20(వార్త): ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిస్తే అధిక దిగుబడి వస్తుందని ప్రకృతి వ్యవసాయం రీజనల్ టీం జిల్లా యాంకర్ హేమసుందర్ అన్నారు. మందస మండలంలోని హంసరాళి పంచాయతీ పెట్టువ గ్రామంలో జరిగిన ప్రకృతి వ్యవసాయం ఏ గ్రేడ్ మోడల్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుల ప్రధాన పంట వరి పండించే టప్పుడు రెండు వైపులా ఉన్న గట్లను 4 నుంచి 6 అడుగుల వరకు వెడల్పు చేసుకుని, పండ్లజాతి మొక్కలను, కరి వేపాకు, బొప్పాయి, మునగ, కూరగాయ పంటలను వేసుకోవాలన్నారు. ఆకుకూరలు, తీగజాతి మొక్కలు కూడా పెంచుకోవచ్చని, అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలతో ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ప్రతీ రైతు దూరంగా ఉడవడానికి లైవ్ షోయింగ్ వేయాలన్నారు. పొలంతో ఆజోల్లా ఉండాలని, డీఏపీ, యూరియాకు బదులుగా ఘన, ద్రవ, జీవామృతాలు వేయాలని సూచించారు. ప్రతీ రైతు శాశ్వత జీవామృతం కిట్ పెట్టుకోవాలని కోరారు. భూమిని 365 రోజులు వంటలతో కప్పి ఉంచాలన్నారు. ఎండీఎస్(నవధాన్యాలు) వేసుకోవాలన్నారు. ప్రతి రైతూ తప్పక ఈక్రాప్ చేయించుకోవాలన్నారు. వంటలను ఆశించే రసం పీల్చే పురుగుల నివారణకు, పంట ఆరోగ్యంగా పెరగడానికి జిల్లేడు ద్రావణం బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ ద్రావణం తయారీ, ఉపయోగం, వాడకం ప్రయోగాత్మకంగా వివరించారు.

కార్యక్రమంలో మార్కెటింగ్ ఎన్ఎస్ఏ శివాజీ, ఎన్ఎస్ఏ ఎంటీ సీహెచ్ సూర్యనారాయణ, ఎల్1 లక్ష్మణ్, ఎల్2 బాలకృష్ణ. ఐసీఆర్‌లు, రైతులు పాల్గొన్నారు.

# హత్యాచారంపై సీఐటీయూ నిరసన ర్యాలీ




సోంపేట, ఆగస్టు 20(వార్త): కోల్‌కత్తాలోని ఆర్జేకర్ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని పాల్పడం అత్యంత దారుణమని, నిందితులను తక్షణమే ఉరి తీయాలన్న ప్రధాన డిమాండ్‌తో సోంపేటలో సిఐటియు ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాలు మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించాయి. సోంపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా నినాదాలు చేసుకుంటూ గాంధీ మండపం వద్దకు చేరింది. అక్కడ ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది మానవ హారంగా ఏర్పడి సంఘటన అమానుషమని తూర్పారబట్టారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు కోనేటి గంగాదేవి, కారాగి గౌరమ్మ, వెదుల్ల హేమలత, గొజ్జ తేజావతి, కార్మిక సంఘాల నేతలు సంగారు లక్ష్మీనారాయణ, ఎల్.బాబూరావు, బట్టిగల్లూరు, కొర్లాం, బారువ, సోంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, సీహెచ్‌సీల పరిధిలోని పలువురు వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### సిరిమామిడిలో చిన్నారుల కొవ్వొత్తుల ర్యాలీ




**సోంపేట:**కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార సంఘటనకు నిరసనగా సోంపేట మండలం సిరి మామిడి గ్రామంలో మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన చిన్నారులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఈ సంఘటనపై నిరసన తెలపడం చూస్తూనే ఉన్నాం, అయితే కేవలం రెండు నుంచి ఐదేళ్ల లోపు ఉన్న చిన్నారులు వినూత్న రీతిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం ప్రత్యేకత సంతరించుకుందని గ్రామస్తులు తెలిపారు.

# పాడి పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి



మందస, ఆగస్టు 20(వార్త): పాడి పశువుల్లో గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమని, పాడి రైతులు ఈ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని మందస, హరిపురం పశు వైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గాలి కుంటు వ్యాధి నివారణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో శ్రీకాంత్, ఉమాభారతి మాట్లాడుతూ సెప్టెంబర్ 18 వరకు ప్రభుత్వం చేపడుతున్న ఈ టీకాలను తప్పనిసరిగా తమ పశువులకు వేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ వ్యాధి వైరస్‌తో సోకుతుందని, అంటువ్యాధి అని, ఒక పశువు నుంచి మరో పశువుకు కలుషిత నీరు, మేతతో సోకుతుందని తెలిపారు. వ్యాధి బారిన పడిన పశువు తీవ్ర జ్వరంతో బాధపడుతుందని, నోటిలో, కాళ్ల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయన్నారు. నోటి నుంచి తీగలు మాదిరి చొంగ కారుతూ తిండి మాని నీరసిస్తాయని, వ్యాధి బారిన పడిన పశువుల్లో పాల దిగుబడి తగ్గడం, చూడి పశువులు ఈసుకుపోవడం, పని సామర్థ్యం తగ్గడం వంటి సమస్యలు వస్తాయన్నారు. వ్యాధి సోకిన తరువాత వైద్యం ఆలస్యం చేస్తే పశువులు చనిపోయి, రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ వ్యాధి రాకుండా వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా వేస్తున్నామని, పాడ రైతులు ఈ వ్యాధి విషయంలో అప్రమత్తంగా ఉంటూ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది ద్వారా వేస్తున్న ఈ టీకాలను వినియోగించుకోవాలని సూచించారు.

## ఆరోగ్యంపై యువత శ్రద్ధ వహించాలి



నరసన్నపేట, ఆగస్టు 20(వార్త): యువత పలు వ్యసనాలకు బలైపోతున్నారని, వారి ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాస్ రావు సూచించారు. మంగళవారం పోలాకి మండలం గుప్పిడిపేట పంచాయతీ చిన్నకొవిరిపేట యువకులకు ఓ ప్రైవేట్ సంస్థ జిమ్ పరికరాలను ఆయన అందజేశారు. సరైన మార్గంలో యువత ప్రయాణం చేస్తే, భవిష్యత్‌లో ఉన్నతమైన స్థానానికి ఎదుగుతారని సూచించారు.

## వృథాగా పోతున్న త్రాగునీరు



నరసన్నపేట, ఆగస్టు 20(వార్త): నరసన్నపేట ప్రధాన రహదారిలో పైప్‌లైన్ లీక్ అవ్వడంతో త్రాగునీరు వృథాగా పోతోందని స్థానికులు వాపోతున్నారు. స్థానిక సెంట్రల్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఓ కోళ్లఫారం సమీపంలో ఈ పరిస్థితి నెలకొనడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## మెనూ ప్రకారం పౌష్టికాహారమందించండి



జలుమూరు, ఆగస్టు 20(వార్త): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని మెనూ ప్రకారం అందించాలని స్త్రీ సంక్షేమ శాఖ ఆర్జేడీ జి.చిన్మయిదేవి అన్నారు. నగిరికటకం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. దస్త్రాలను పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్న పోషకాహారం కిట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. సూపర్‌వైజర్ సీతామాలక్ష్మి పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను గుర్తించండి

నరసన్నపేట, ఆగస్టు 20(వార్త): పంచాయతీల్లో అభివృద్ధి ధ్యేయంగా కార్యక్రమాలను చేపట్టాలని ఎంపీడీవో బొడ్డేపల్లి మధుసూదనరావు తెలిపారు. మంగళవారం నరసన్నపేట మండల ఉపాధి హామీ కార్యాలయంలో సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు ఈనెల 23న అన్ని పంచాయతీల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీవో యుగంధర్ పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రేపు సంతబొమ్మాళి మండల సమావేశం



సంతబొమ్మాళి, ఆగస్టు 20(వార్త):సంతబొమ్మాళి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ ప్రేమలీల ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి గౌరవ సభ్యులంతా సమయానికి హాజరు కావాలని ఆమె కోరారు. మండల స్థాయి అధికారులు అంతా పూర్తి సమాచారంతో విధిగా హాజరు కావాలని ఆమె తెలిపారు.

ఈ సమావేశానికి అధికారులు గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీవో స్పష్టం చేశారు.

# పని సర్దుబాటయ్యేనా?



- మార్గదర్శకాలను విడుదల చేసిన పాఠశాల విద్యా శాఖ కమిషనర్
- మండల, డివిజన్, జిల్లా స్థాయిలో నిర్వహణ
- ఉపాధ్యాయులుగా చేరిన రోజున సీనియారిటీగా పరిగణింపు
- గడువును పెంచిన ప్రభుత్వం
- ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనలు

హిరమండలం, ఆగస్టు 20(వార్త): ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. విద్యార్థులు తక్కువగా ఉండి, పూర్తిస్థాయిలో పనిభారం లేని ఉపాధ్యాయులను అవసరం ఉన్న ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేసే ప్రక్రియ కొద్ది రోజుల్లోనే ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విడుదల చేశారు. ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను నిర్వహిస్తారు. ఇదివరకు ఏ యాజమాన్యంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను అదే పాఠశాలకు సర్దుబాటు చేసేవారు. ప్రస్తుతం మండల, డివిజన్, జిల్లా యూనిట్‌గా నాలుగు యాజమాన్యాల్లోని పాఠశాలలకు ఈ ప్రక్రియ నిర్వహించనున్నారని తెలుస్తోంది. ప్రధానంగా ఇతర యాజమాన్యాల పాఠశాలలకు కూడా ఉపాధ్యాయులను కేటాయిస్తారు. స్కూల్‌అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తారు. పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య, యూడైస్ డేటా ఆధారంగా ఆయా పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను గుర్తిస్తారు. పాఠశాలల్లో గత నెల జూలై 31 నాటికి ఉన్న వాటినే ఖాళీగా చూపిస్తారు. ఉపాధ్యాయుల సర్దుబాటుకు 117 జీవోలోని విధి విధానాలనే పాటించాలని కమిషనర్ సూచించారు. ఈ ప్రక్రియను త్వరితంగా పూర్తిచేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

**పని సర్దుబాటు ప్రాధాన్యతలు ఇవే...**

ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రాధాన్యతలను కమిషనర్ తన మార్గదర్శకాలలో వివరిస్తూ ఉన్నత పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులకు కొరత లేకుండా చేసేందుకు తొలి ప్రాధాన్యత ఇచ్చారు. సాధారణంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో 98 మందికి తక్కువగా విద్యార్థులు ఉంటే ఒకటి, రెండు తరగతులకు వేరుగా, మూడు నుంచి ఎనిమిదవ తరగతి వరకు వేరుగా ఉపాధ్యాయులను కేటాయించనున్నారు. అన్ని పాఠశాలలకు ఎస్జీటీలను సర్దుబాటు చేయగా ఇంకా మిగిలితే వారిని ఏకోపాధ్యాయ పాఠశాలకు పంపుతారు.

**మినహాయింపు..**

2025 ఏప్రిల్ 30వతేదీలోపు ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులను పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇచ్చారు. 100 శాతం అంధత్వం ఉన్న ఉపాధ్యాయులను కూడా మినహాయింపులోకి కలిపారు. ఇంకా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్ ఇంటర్ ఉన్న పాఠశాలలను సర్దుబాటు ప్రక్రియ నుంచి తప్పించారు. వితంతువులు, అవివాహితులు, చట్టబద్ధంగా విడాకులు తీసుకున్న ఉపాధ్యాయినులు, స్పౌజ్ ఉన్నవారికి సైతం మినహాయింపు ఉంటుంది. ఒకవేళ వీరు బదిలీ కోరుకుంటే వారిని సర్దుబాటుకు అనుమతిస్తారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పని చేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు సర్దుబాటు చేయవద్దని పేర్కొన్నారు.

**మూడు దశల్లో కౌన్సెలింగ్..**

మిగులు ఉపాధ్యాయులను మూడు దశలో కౌన్సెలింగ్‌కు నిర్వహించి సర్దుబాటు చేయనున్నారు. మొదటి దశలో మండల విద్యాశాఖాధికారి ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇది కమిషనర్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో వచ్చే సీనియారిటీ జాబితా ప్రకారం జరుగుతుంది. మండలంలో ముందుగా ఉపాధ్యాయులు అవసరం ఉన్న పాఠశాలలను గుర్తిస్తారు. వీటికి మిగులు ఉపాధ్యాయులను కేటాయిస్తారు. మండల స్థాయిలో పూర్తయిన తరువాత మిగిలిన ఉపాధ్యాయులు డివిజన్ స్థాయికి హాజరు కావాలి. అక్కడ ఉప విద్యాధికారి ప్రక్రియను నిర్వహిస్తారు. ఇంకా మిగిలిపోయిన ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో జిల్లా విద్యాశాఖాధికారి ఈ ప్రక్రియను నిర్వహించనున్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటులో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కూడా ఎస్జీటీలుగానే పరిగణిస్తారు.

**జాబితాలు సిద్ధం..**

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య సరిపడా స్కూల్ అసిస్టెంట్ లేకపోవడంతో సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు కొరత ఎక్కువగా ఉందని తెలుస్తోంది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య దారుణంగా పడిపోవడంతో వేల సంఖ్యలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మిగులుగా ఉన్నారని తెలుస్తోంది. రాష్ట్రంలో సబ్జెక్ట్ ఉపాధ్యాయులు 17 వేలకు పైగా అవసరం ఉండగా కేవలం ఎనిమిది వేల మంది సబ్జెక్ట్ చెప్పేవారు మాత్రమే మిగులుగా కనిపిస్తున్నారు.

మరోపక్క లోపభూయిష్టంగా ఉన్న పని సర్దుబాటు కార్యక్రమాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే జిల్లావ్యాప్తంగా ఆయా ఉపాధ్యాయ సంఘాలు నిరసనలు, ఆందోళనలు చేపట్టాయి. ఇలా పలు అనుమానాలు, సమస్యల నడుమ చేపట్టనున్న ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ సజావుగా సాధ్యమయ్యేనా అనే సందేహం అందరిలోనూ వ్యక్తమవుతోంది.

## ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయండి



నరసన్నపేట, ఆగస్టు 20(వార్త): ఖరీఫ్ సీజన్లో పండిస్తున్న పంటలను ఈ క్రాప్ ద్వారా నమోదు చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ రవీంద్రభారతి ఆదేశించారు. మంగళవారం నరసన్నపేట స్థానిక ఏడీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి వ్యవసాయ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకు 30 శాతం మేర పంట నమోదు ప్రక్రియ సాగిందని, వచ్చే నెల 15వ తేదీకి పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తతేనే రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు.

## నిమ్మకాయల అలంకరణలో 'శాంతామణి'



నరసన్నపేట, ఆగస్టు 20(వార్త): నరసన్నపేట పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న గ్రామ ఇలవేల్పు శాంతామణి దేవి అమ్మవారు నిమ్మకాయల అలంకరణలో భక్తులకు కనువిందు చేశారు. శ్రావణ మంగళవారం సందర్భంగా స్థానిక ఆలయ ప్రధాన అర్చకులు బాబు ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు భక్తులు తరలివచ్చారు.

## దోమల నివారణతోనే వ్యాధులు దూరం

నరసన్నపేట, ఆగస్టు 20(వార్త): దోమలను నివారించగలిగితే వ్యాధులను దూరం చేసుకోవచ్చని వైద్యాధికారులు అరవింద్, సుజాత తెలిపారు. జాతీయ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం నరసన్నపేట మండలం ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సుతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ నీటి కుంటలు లేకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# గిరిజనులకు డోలీ కష్టాలు



- రహదారి కల్పించాలి
- కొండూరు ముఠా గ్రామాలను కొత్తూరులో విలీనం చేయాలి
- గిరిజనుల డిమాండ్


హిరమండలం, ఆగస్టు 20(వార్త): దశాబ్దాలు మారినా గిరిజనులకు డోలీ కష్టాలు తీరడం లేదు. అడవి బిడ్డల అవస్థలకు పరిష్కారం లభించడం లేదు. కొండూరు ముఠా గ్రామ గిరిజనులకు డోలీ కష్టాలు తప్పడం లేదు. డోలీ మోతలతో ప్రాణాలు కోల్పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు ఇప్పటికైనా తమ గ్రామానికి రహదారులు వేయాలని వేడుకుంటున్నారు. మంగళవారం పాండ్రమూనగూడ గిరిజన గ్రామానికి చెందిన సవర రాజు అనారోగ్యానికి గురి అవ్వటంతో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి బురదమయం కావడంతో పాటు కొట్టుకుపోవడంతో సంబంధిత గ్రామం నుంచి బూతాలగూడ సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకు డోలీపై మోసుకుంటూ వచ్చారు. ముందస్తుగా 108 వాహనానికి సమాచారం అందజేయడంతో బూతాలగూడ గ్రామంలో 108 వాహనం ద్వారా జిల్లా కేంద్రాసుపత్రికి వైద్యచికిత్స కోసం తరలించారు.

**ఎందుకు ఇలా...**

ఒకానొకప్పుడు కొండూరు ముఠా హిరమండలం మండలం పాడలి గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. వంశధార జలాశయం నిర్మాణంలో భాగంగా పాడలి నిర్వాసిత గ్రామం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కాలనీలకు తరలి వెళ్లిపోయింది. దీంతో పాడలి పంచాయతీ పరిధిలో ఉన్న కొండూరు ముఠా పరిధిలో ఉన్న పెద్దగూడ, చీడిమానుగూడ, గేసరిగూడ, పాండ్రమానుగూడ, బలదగూడ, పొలంగూడ, ఎగువగూడ తదితర గూడలతో పెద్దమానుగూడ పంచాయతీగా ప్రత్యేకంగా ఏర్పాటైంది. అయితే అధికారులు,గత పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం డినోట్ కాలేకపోవటంతో అటు కొత్తూరు మండలానికి చెందక, ఇటు హిరమండలం మండలానికి చెందక సంబంధిత గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేని పరిస్థితి ఏర్పడింది. పెద్దగూడ పంచాయతీ ఏర్పడినప్పటికీ కొత్తూరు, హిరమండలం మండలాలకు చెందకపోవడంతో అభివృద్ధి కానరావడం లేదని గిరిజనులు వాపోతున్నారు. సంబంధించిన గ్రామాలు హిరమండలం మండలం మర్రిగూడ సచివాలయ పరిధిలో ఉండడంతో అక్కడకు పని మీద వెళ్లాలంటే సుమారు 20 కి.మీ దూరం ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉపాధి, పింఛన్ తదితర పనులు హిరమండలం మండలంలో ఉంటే..మిగతా పరంగా కొత్తూరు మండలం పరిధిలో ఉండడంతో అభివృద్ధి పనులు జరగక గిరిజనులు సతమతమవుతున్నారు. దీంతో రహదారులు పూర్తిగా ఛిద్రమైనా, పట్టించునే నాధుడు లేకపోవటంతో డోలీలు తప్పని పరిస్థితి నెలకొంది. గిరిజన సమస్యలు పట్టించుకోవాలని, హిరమండలం నుంచి కొత్తూరు మండలానికి విలీనం చేసి గొట్టిపల్లి సచివాలయంలో కలపాలంటూ గత నెల 21న పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావుకు గిరిజనులు తమ సమస్యను విన్నవించుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టిలో పెట్టి సమస్య పరిష్కరిస్తానని ఆయన హామీని ఇచ్చారు. రహదారి సౌకర్యం లేక, అత్యవసర వాహనాలు గిరిజన గ్రామాల్లోకి రాకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే రహదారి సౌకర్యంతో పాటు పెద్దగూడ పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన గ్రామాలు కొత్తూరు మండలంలో విలీనం చేయాలని వారు కోరుతున్నారు.

# 'బాపూజీ కలలను సాకారం చేద్దాం'

పోలాకి, ఆగస్టు 20(వార్త): బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక మండల ప్రజా పరిషత్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వరకే రాజకీయాలని , ఆ తర్వాత ప్రతి ప్రజా ప్రతినిధి అభివృద్ధి వైపే దృష్టి సారించాలని పేర్కొన్నారు. మండల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.





## 14న లోక్ అదాలత్

**పలాస, ఆగస్టు 20 (వార్త):** పలాస సివిల్ కోర్టులో సెప్టెంబర్ 14న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పలాస సివిల్ ఇన్చార్జి జడ్జి బీఎంఆర్ ప్రసన్న లత తెలిపారు. పలాస సివిల్ కోర్టులో మంగళవారం న్యాయవాదులు, పోలిస్ అధి కారులతో ఆమె లోక్ అదాలత్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు కేసుల నుంచి శాశ్వతంగా విముక్తి పొంద డానికి లోక్ అదాలత్‌లు చక్కని వేదిక అని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. సమా వేశంలో సూపరింటెండెంట్ కృష్ణ, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

# గెలుపోటములు సహజం

- ప్రజాగొంతుకగా నిలబడుదాం
- ప్రజా సమస్యల పరిష్కారంలో టీడీపీ ప్రభుత్వం విఫలం
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



**బూర్జ, ఆగస్టు 20 (వార్త):** బాధ్యత గల ప్రతిపక్షంగా, ప్రజల గొంతుకగా నిలుస్తూ ప్రజాపక్షంగా నిలుద్దామని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం వైసీప క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం బూర్జలో ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో మండల వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని సీతారాం మాట్లాడుతూ దేశంలో ఏ ఒక్క ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ప్రజలకు మేలు చేసినప్పటికీ వైసీపీ అధికారం కోల్పోవడం బాధాకరమైన విషయమన్నారు. గత రెండు నెలలుగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు మేలైన పాలన అందించలేకపోవటం ప్రజల్లో ఒక రకమైన అసహనం ప్రారంభమైందన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలులోను ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇదే సమయంలో బాధ్యతగల ప్రతిపక్షంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోరారు. తమ ప్రభుత్వ హయంలో ఉన్నత స్థాయి ప్రభుత్వ సంస్థలు, ప్రాజెక్టులు వంటివి మంజూరు చేయించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే వాటికి సంబంధించి ఆర్థిక పరమైన ఆమోదం పొందాయన్నారు. వీటి అభివృద్ధికి అవసరమయ్యే నిధులు తక్షణం మంజూరు జరిగేలా స్థానిక శాసనసభ్యులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికలకు పార్టీ క్యాడర్ ఇప్పట నుండి సమాయత్తం కావాలని తమ్మినేని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ వైసీపీ క్యాడర్‌కు అండగా ఉంటామన్నారు. సమావేశంలో రాష్ట్ర యువజన నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపీపీ కర్నెన దీప, జడ్పిటిసి బెజ్జీపురపు రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు కండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, బూర్జ మండల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెలకువలు పాటిస్తే ఫొటోగ్రఫీలో ఉజ్వల భవిష్యత్

- జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి చెన్నకేశవరావు
- ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం




**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 20 (వార్త):** కెమెరా కన్ను చరిత్రకు సాక్ష్యమవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సంద ర్భంగా ఫొటోగ్రాఫర్ల సంఘం సోమవారం సాయంత్రం నగరంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప కళల్లో ఫొటోగ్రఫీ కూడా ఒకటని, ఫొటోగ్రఫీ వృత్తి ద్వారా అత్యున్నత స్థాయికి చేరు కున్నవారు ఎందరో ఉన్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటితరం ముందుకు నడ వాలన్నారు. మెలకువలను నేర్చుకుంటూ ముందుకు సాగితే ఫొటోగ్రఫీలో ఉజ్వల భవిత ఉంటుందని చెప్పారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్‌సింగ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ఫొటోగ్రాఫర్ అవసరం ఉంటుందన్నారు. ప్రభుత్వాల పాలనలోనూ ఫొటోగ్రఫీ ప్రాముఖ్యత ఎంతో కనిపిస్తుందని పేర్కొన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటు, స్వాతంత్ర్య పోరాటం కొన్ని దశాబ్దాల క్రితం పరిపాలనా విధానం గురించి చరిత్రకు సాక్ష్యంగా ఫొటోగ్రఫీ నిలిచిందని తెలిపారు. వివాహాది వేడుకలకు వెళ్లే ఫొటోగ్రాఫర్లు రాత్రి వేళ వచ్చేటప్పుడు పోలీసుశాఖ నుండి చిక్కులు ఎదుర్కొంటున్నారని గుర్తింపు కార్డులు ఉంటూ వారి జాబితా పోలీసు అధికారులకు ఇవ్వడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చునన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జోగినాయుడు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సమస్య లను పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సహాయ సహకారాలు అవసరమన్నారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా పూర్వ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్ పదివేల రూపాయల ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కెమెరాను కనుగొన్న లూయిస్ డాగురే 185వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేశారు. జిల్లాలో సీనియర్ ఫొటోగ్రాఫర్ పొడుగు గజపతిని అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి దేవీప్రసాద్, సంఘ ప్రతినిధులు కొర్లాడ కొండబాబు, లోపింటి చిట్టిబాబు, కిల్లంశెట్టి శ్రీనివాస్, జిల్లాలోని పలువురు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# చరిత్ర పరిశోధకుడు ముత్యం మృతి



**పలాస, ఆగస్టు20 (వార్త):** చరిత్ర పరిశోధకుడు డాక్టర్ కె.ముత్యం మృతి చెందడం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు మద్దిల రామారావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తిరి దానేష్ అన్నారు. మంగళవారం ఆయన మృతికి తీవ్ర సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంస్కృతిక రంగంలో చరిత్ర అధ్యాపకుడిగా ఆయన ఎన్నో రచనలు చేశారని, ఉత్తర తెలంగాణ, నిజామాబాదులో 1952లో జన్మించారని, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ తెలుగు విద్యార్థిగా ఉన్నప్పుడు పిడిఎస్‌యు విప్లవ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నికైన దగ్గర నుండి ఆయన మృతి చెందే వరకు పీడిత, తాడిత ప్రజానీకం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తు చేశారు. బెనారస్ విశ్వవిద్యాలయంలో శ్రీకాకుళ సాహిత్యం మీద పిహెచ్‌డి చేశారన్నారు. అది మొదలు శ్రీకాకుళ ఉద్యమం పైన ఉత్తరాంధ్ర పైన 40 ఏళ్లుగా ఆయన నిరంతరం అధ్యయనం చేస్తూ మట్టి పొరలు కింద కప్పబడ్డ చరిత్రను పరిశోధిస్తూ వాటి శకలాలను తవ్వితీస్తూ పుల్లెల



శ్యాంసుందర్, గరీమెళ్ళ సత్యనారాయణ, మార్పు పద్మనాభం, గంటు రాజేశ్వరరావు, గానుగుల తరుణాచారి, విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి జీవిత చరిత్రలు, కామ్రేడ్ గంటి రాజేశ్వరరావు, వీర గున్నమ్మ చరిత్ర, సునాముది జీవధార, ప్రవహిస్తున్న జ్ఞాపకం, అనేక రచనలు చేశారన్నారు. బంకుపల్లి మల్లయ్య శాస్త్రి చల్లా రాజులు దళిత కవి 12 పుస్తకాలు శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా ఉత్తరాంధ్రపైన ఆయన పరిశోధనలకు నిదర్శనంగా నిలబడ్డాయని, ప్రజల పక్షపాతిగా పీడిత ప్రజల పక్షాన ఆయన నిరంతరం స్పందించేవారని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అనేక ప్రజా ఉద్యమాల్ని, నాటి చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చారని, కామ్రేడ్ ముత్యం మరణం బాధాకరం ఆయనకు విప్లవ జోహార్లను అర్పిస్తున్నామన్నారు. సంతాపం తెలిపిన వారిలో వంకల మాధవరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, తెప్పల డిల్లీ రావు, వైకుంఠ రావు, జుత్తు వీరిస్వామి, పి.నాగేశ్వరరావు, వంకల అప్పయ్య ఉన్నారు. అమరుడు కామ్రేడ్ కె.ముత్యం భౌతిక దేహంపై అరుణోదయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



## క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

**పలాస, ఆగస్టు 20 (వార్త):** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రమణరావు అన్నారు. మంగళవారం బ్రాహ్మణతర్లా హైస్కూల్ ప్లస్ (బాలికల జూనియర్ కళాశాల) లో ద్వితీయ ఏడాది ఇంటర్ విద్యార్థినిలు, మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ.. నూతనంగా గ్రామీణ ప్రాంతంలో ఏర్పడిన ఈ బాలికల జూనియర్ కళాశాలను అందరూ వినియోగించుకొని బాలికా విద్యకు ప్రోత్సహించి మహిళా సాధికార దిశగా దూసుకుపోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ రమణారావు ఆధ్వర్యంలో జరగగా, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు ఆర్.బాల శంకరం, సభ్యులు ఎ.కృష్ణారావు, జి.అప్పారావు, సీనియర్ ఉపాధ్యాయులు అప్పన్న, ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీజన్ వ్యాధులపై అప్రమత్తం




**పలాస, ఆగస్టు 20 (వార్త):** సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వార్డు కౌన్సిలర్ ప్రతినిధి డొక్కరి శంకర్ అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 30వ వార్డు పరిధిలోని ఉదయపురం గ్రామంలో మంగళవారం పలాస క్యాజుల్యాండ్ వనిత, శ్రీకాకుళం రాగోలు జేమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచి తంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలాస క్యాజ్ ల్యాండ్ వనిత అధ్యక్షురాలు తర్లాన శ్వేత కుమారి, కార్యదర్శి మల్ల సంతోషి, కోశాధికారి తూముల గాయత్రి, పూర్వ అధ్యక్షురాలు మల్లా జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## బాలసదనం తనిఖీ



**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 20 (వార్త):** అరసవిల్లిలో ఉన్న బాలసదనం శిశు గృహను ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు, సేఫ్టీ అండ్ సెక్యూరిటీ గురించి బాలికలను అడిగి తెలుసుకున్నారు. బాలసదనంలో పిల్లలను బాగా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

## జీతాలు చెల్లించాలని స్కూల్ స్వీపర్ల వినతి

**పలాస, ఆగస్టు 20 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి, స్వీపర్ల ప్రతినిధులు పి.సుశీల, బి.స్వాతి డిమాండ్ చేశారు. పలాస మండల విద్యాశాఖ కార్యక్రమం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం ఎంఈఓ సిహెచ్ శ్రీనివాసరావుకు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పాఠ శాలల అభివృద్ధిలో స్కూళ్లలో శానిటేషన్ వర్కర్స్‌ని నియమించారని, వారికి గత నాలుగు నెలలుగా జీతాలు అందక నానా అవస్థలు పడుతున్నారన్నారు. అందులో పని చేసే అందరూ దళిత, గిరిజన, అణగారిన వర్గానికి చెందిన వారని, నెలంతా చాకిరీ చేస్తే నెలకు జీతం ఇవ్వకపోతే కుటుంబం ఎలా గడుస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్య క్రమంలో ఆదమ్మ, నరసమ్మ, బి ఉమా, బి శకుంతల తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
శ్రీకాకుళం



## మైనర్లు.. వాహనాలు నడపొద్దు

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 20 (వార్త):**జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల్లో పోలీసు శాఖ మైనర్ డ్రైవింగ్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనర్థాలు, సైబర్ నేరాల నియంత్రణపై మంగళవారం అవగాహన సదస్సులను నిర్వహించింది. శ్రీకాకుళం, గార, జి.సిగడాం, ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలను ఎస్ఐలు, సిబ్బంది చేపట్టారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. డ్రగ్స్, ర్యాగింగ్‌నకు దూరంగా ఉండాలని సూచించారు. బ్యాడ్ టచ్, గుడ్ టచ్ విషయంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగిఉండాలన్నారు.



## హత్యాచార నిందితులను
# తక్షణం శిక్షించాలి

***జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీ పేడాడ రామ్మోహన్ *ఆమదాలవలసలో కొవ్వొతులతో నిరసన ర్యాలీ**

**ఆమదాలవలస, ఆగస్టు 20 (వార్త):** కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ మౌమిత దేవనాద్ అత్యాచార సంఘటనను నిరసిస్తూ ఆమదాలవలస పట్టణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక నియోజకవర్గ ఇన్చార్జ్ పేడాడ రామ్మోహన్ రావు తో పాటు పార్టీ శ్రేణులు కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని వన్ వే జంక్షన్ మీదుగా స్థానిక పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. అనంతరం వన్ వే జంక్షన్ వద్ద మనవహారం చేపట్టారు. ఈ సందర్భంగా పేడాడ రామ్మోహన్ మాట్లాడుతూ మహిళలపై దాడులు రోజురోజుకు పెరుగుతూ వస్తున్నాయన్నారు. ఘటన జరిగి దాదాపుగా రెండు వారాలు కావస్తున్న నేటికీ నేరస్థులకు శిక్ష ఖరారు కాకపోవడం దారుణమన్నారు. న్యాయ వ్యవస్థ కూడా నిందితులను వెంటనే శిక్షించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు బలమైన చట్టాలను తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు, మండల నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## రిమ్స్ వైద్య విద్యార్థుల వినూత్న నిరసస

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 20 (వార్త):** కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్య ఘటనపై సిక్కోలు జిల్లాలో నిరసనలు మిన్నంటుతున్నాయి. వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ రిమ్స్‌లో వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మంగళవారం వినూత్న నిరసన చేపట్టారు. వైద్య విద్యార్థులు సెల్‌ఫోన్ ఫ్లాస్ లైట్లతో నగరంలో ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జూడా సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.వెంకటేష్, అంబేద్కర్, ఎన్. మోహిత్ కుమార్, రాజ్ కుమార్, ప్రియాంకతో పాటు పెద్ద ఎత్తున వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## వారానికోసారి ప్రత్యేకాధికారులు..
# మండలాలు సందర్శించండి


*** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం * వివిధ శాఖలపై అధికారులతో సమీక్ష**

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు20 (వార్త):** వారానికోసారి ప్రత్యేక అధికారులు మండలాలకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్డీఓలు, మండల స్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఈఆర్వోలంతా ఎలక్ట్రోరల్స్ కు సంబంధించి ధరఖాస్తులు పెండింగులో ఉండరాదన్నారు. ఎలక్ట్రోరల్స్ పై టెక్కలి ఇన్ చార్జ్ ఆర్డీఓ సుదర్శన్ దొరను ఆయన అడుగగా ఎలక్ట్రోరల్స్ వివరాలను కలెక్టర్‌కు వివరించారు. 21 నుంచి ఇంటింటి సర్వే చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రోరల్స్‌పై మండలాల వారీగా ఆయన సమీక్షించారు. రెవెన్యూ శాఖ పై మ్యుటేషన్లు, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ పై ఏమైనా సమస్యలు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మండలాల వారీగా ఆయన సమీక్షిస్తూ పెండింగులో ఉన్న సర్టిఫికెట్లు, తదితర వాటిపై ఆయన సమీక్షించారు. పెండింగులో ఉన్న దరఖాస్తులపై అలసత్వం ప్రదర్శించ వద్దన్నారు. వ్యవసాయంపై కౌలు, రీ సర్వే, తదితర అంశాలపై జెడి శ్రీధర్ వివరించారు. ప్రతీ ప్రభుత్వ పథకం నేరుగా మండల అధికారులు ద్వారా వెళ్లాలని ఆదేశించారు. హైకోర్టు, లోకాయుక్త కేసులపై తక్షణమే స్పందించాలన్నారు. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ పై జిల్లా అధికారి కె. మన్మథరావు శాఖ పై సవివరంగా వివరించగా ప్రజల పై అదనపు టాక్స్ లు వేయరాదని కలెక్టర్ చెప్పారు. సర్వే అండ్ లాండ్ రికార్డులపై ఎడి విజయ్ కుమార్ వివరించారు. గృహ నిర్మాణాలపై ఆయన మాట్లాడుతూ 100 రోజుల్లో నిర్ణయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. రోజు వారీ, వీక్లీ టార్గెట్ ఉండాలన్నారు. నిర్మాణాలు, లే అవుట్స్ లలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. లబ్దిదారులకు అవగాహన కల్పించాలని, ప్రాథమికంగా సంక్షేమ అసిస్టెంట్



రెస్పాన్స్ ఉంటుందని చెప్పారు. కాంట్రాక్టర్‌పై ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలన్నారు. మండలాల వారీగా ఆయన సమీక్షించారు. స్వంత సైట్లు ఉన్న లబ్దిదారులపై దృష్టి సారించి నిర్మాణాలు ప్రారంభించేటట్లు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ పై డిఎంహెచ్ఓ డాక్టర్ బి. మీనాక్షి సీజనల్ వ్యాధులపై వివరించారు. గ్రామాల్లో కేసు వస్తే స్వయంగా డాక్టర్, ఈఓపిఆర్డీ, ఎఎన్ఎం, ఆషా వెళ్లి అక్కడ పరిసరాలను పరిశీలించి నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంటికి వెలుపల, బయట నీరు నిల్వ లేకుండా చూడాలని చెప్పారు. మహిళా శిశు సంక్షేమం పై పిడి బి. శాంతి శ్రీ వివరించగా కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. జిల్లా పంచాయతీలపై జడ్పీ డిప్యూటీ సిఈఓ వెంకటరామన్ పారిశుద్ధ్యం, ఓడిఎఫ్ ప్లస్, చెత్త సేకరణ, ట్యాక్స్ కలెక్షన్లు, తదితర అంశాలపై వివరించారు. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే ఉపాధి హామీ లో చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పై 23వ తేదీన జరగబోయే గ్రామ సభకు అంతా హాజరవ్వాలని ఆదేశించారు. లిభూగర్భ గనుల శాఖలపై మండల స్థాయి టాస్క్ ఫోర్స్ గ్రామ స్థాయిలో అక్రమ ఇసుక రవాణా లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి సంతకంతో ఎడ్ల బండ్లుతో ఇసుక తరలించవచ్చున్నారు. ఇసుక ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. పింఛన్లపై డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ వివరించారు. పెన్షన్లు పంపిణీ చేసే అధికారులను గుర్తించి 50 మందికి మేపింగ్ చేయాలని చెప్పారు. వచ్చే పెన్షన్లు పంపిణీలో ఎలాంటి సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. డిసిసిబిలో రుణాలు ఎంత మంది రైతులు తీసుకున్నారో ఆ వివరాలను అప్ లోడ్ చేయాలన్నారు. ఉద్యాన వన శాఖ పై మండలాల్లో ఒక ఉద్యాన వన శాఖ అధికారిని ఎడి నియమిస్తారు. వారితో ప్రతీ వారం ఉద్యాన వన పంటలపై సమీక్షించాలని తహసీల్దార్లను ఆదేశించారు. శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఎడి వర ప్రసాద్ వివరించారు. ఎపిఎంఐపి. లిపశు సంవర్ధక శాఖలపై సమీక్షించారు. అనంతరం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ఈ నెల 20 నుండి వచ్చే నెల 18 వరకు టీకాల కార్యక్రమానికి సంబంధించి గోడ పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, ఆర్డీఓ సిహెచ్ రంగయ్య, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మథరావు, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, కో ఆపరేటివ్ జాయింట్ రిజిస్ట్రార్ సుబ్బారావు, వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. మీనాక్షి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, డ్వామా పిడి చిట్టిరాజు, మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి బి. శాంతి శ్రీ, ఎపిఎంఐపి డిడి శ్రీనివాసరావు, డిసిసిబి సిఇఓ వర ప్రసాద్, భూగర్భ గనుల శాఖ డిడి సత్యనారాయణ, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# దోమల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

*** ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా దోమల వ్యాప్తిని అరికట్టాలి * పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి**

***డీఎంహెచ్ఓ డాక్టర్ మీనాక్షి * నగరంలో దోమల నివారణ ర్యాలీ**

**శ్రీకాకుళం, ఆగస్టు 20(వార్త):** ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా దోమల వ్యాప్తిని అరికట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. దోమలు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి మీనాక్షి జండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ 7రోడ్ల కూడలి వరకు కొనసాగింది అనంతరం కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి మాట్లాడుతూ 1897 ఆగస్టు 20న దోమల నివారణ దినోత్సవంగా ప్రకటించారన్నారు. దోమల నుంచి మలేరియా వ్యాపిస్తోందని సర్ రోనాల్డ్ రాస్ కనుగొనడంతో అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల నివారణకు ఎక్కువ అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది నేటికీ 30 మలేరియా కేసులు గుర్తించడం జరిగిందని, గతసంవత్సరం కన్నా ఈ సంవత్సరం మలేరియా కేసులు పెరగడానికి ప్రధాన కారణం ప్రక్క జిల్లాల నుంచి వ్యాప్తి చెందడమే కారణమన్నారు. దోమలు కుట్టడం వల్ల అనేక



వ్యాధులు ప్రబలు తున్నాయి. వ్యాధులు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. మలేరియా, ఫైలేరియా, డెంగీ వంటి ఎన్నో వ్యాధులకు దోమలే కారణమన్నారు. రసాయనాలతో కూడిన అనేక రకాల లిక్విడ్ లు, క్వాయిల్స్ వంటివి మార్కెట్లో లభిస్తున్నాయి. వీటిని ఉపయోగించడం వల్ల అనేక రకలైన శ్వాసకోస వ్యాధులు ప్రబలే ప్రమాదం లేకపోలేదు. ముందుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమల నివారణకు వైద్య శాఖ ద్వారా పలు అనేక చర్యలు చెపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పి.వి. సత్యనారాయణ, ఏఎంఓ ఎస్. శ్రీనివాస్, డీసీ శ్రీకాంత్, హెల్త్ ఎగ్జిక్యూటర్ పి.మోహిని, సామాజిక కార్యకర్త డా.మంత్రి వెంకటస్వామి, లక్ష్మణరావు, జయలక్ష్మి, మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413